సాక్షి
కర్నూలు
బుధవారం । 12 । జూలై । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని శనగల బసవన్నకు, బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా ఈఓ లవన్న, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



శాకాంబరీగా ఎల్లమ్మ

కర్నూలు (న్యూటౌన్): నగర శివారులోని వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మ అమ్మవారు ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



తియ్యని 'ఉపాధి'

జిల్లాలో ఉపాధి నిధులతో పండ్ల తోటల అభివృద్ధికి అధికారులు చేపట్టారు. తాజాగా పండ్ల మొక్కలు నాటుకునేందుకు గుంతల తవ్వకం పనులు చేపడుతున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

జగనన్న వసతి, విద్యా దీవెనకు ఎన్‌పీసీఐ తప్పనిసరి

కర్నూలు(అర్బన్): 2022–23 విద్యా సంవత్సరానికి జగనన్న వసతి, విద్యా దీవెన నిధులు విడుదల కాని ఇంటర్మీడియట్ ఎస్సీ విద్యార్థులు పోస్టాఫీసుల్లో ఐపీపీబీ ఖాతాను ఓపెన్ చేసి ఎన్‌పీసీఐ పోర్టల్‌కు లింక్ చేయించుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు జె.రంగలక్ష్మీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌పీసీఐలో లింక్ చేసిన వివరాలను సంబంధిత గ్రామ/వార్డు సచివాలయాల్లోని డబ్ల్యూఈఏ/ డబ్ల్యూఈడీపీఎస్‌లకు తెలియజేయాలన్నారు. ఈ నేపథ్యంలోనే వసతి, విద్యా దీవెనకు అర్హులైన ఎస్సీ విద్యార్థులు తమ ఆధార్‌తో పాటు తల్లి ఆధార్‌ను బ్యాంక్ ఖాతాకు సీడింగ్ చేసేందుకు సంబంధిత బ్యాంకు మేనేజర్లను కలవాలన్నారు. బ్యాంకు ఖాతా లేని వారు పోస్టాఫీసుల్లో ఖాతాలు ఓపెన్ చేసుకోవాలని కోరారు.

ఎన్నికల చట్టాలపై అవగాహన అవసరం

కర్నూలు(సెంట్రల్): నూతన ఎన్నికల చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు అన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024కు సంబంధించి ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్లకు మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు ఎలక్షన్స్ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సామగ్రి పరిశీలన

కర్నూలు(సెంట్రల్): జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన సామగ్రిని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పరిశీలించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్‌లో ఉంచిన జగనన్న సురక్ష పథకానికి సంబంధించిన స్టిక్కర్లు, హోలోగ్రామ్‌లు, సర్టిఫికెట్ల కాగితాలను పరిశీలించి జాగ్రత్తగా సచివాలయాలకు పంపాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



నంద్యాల జిల్లాలోని పారుమంచాలలో నిర్మించిన మల్టీపర్పస్ గోదాము

మద్దతుగా నిలుస్తూ.. భరోసా కల్పిస్తూ!

ఉమ్మడి జిల్లాలో 227 గోదాములు

- రూ.121.25 కోట్లతో ఆర్బీకే వారీగా నిర్మాణం
- ఇప్పటికే 72 నిర్మాణాలు పూర్తి
- సెప్టెంబర్ చివరిలోపు పూర్తి చేసేందుకు కసరత్తు
- గిట్టుబాటు ధర లేనప్పుడు నిల్వ చేసుకునే అవకాశం
- అనుబంధంగా ప్లాట్‌ఫాంల ఏర్పాటు

కర్నూలు(అగ్రికల్చర్): గిట్టుబాటు ధర లేనప్పుడు కొద్ది నెలల పాటు పంట దిగుబడులను నిల్వ చేసుకునేందుకు.. మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేసినప్పుడు భద్రపరిచేందుకు.. ఎరువులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోంది. రైతుభరోసా కేంద్రాల వారీగా పెద్ద ఎత్తున గోదాముల నిర్మాణం జరుగుతోంది. మల్టీపర్పస్ గోదాముల పేరిట వీటి నిర్మాణం ఉద్యమ తరహాలో సాగుతుండటం విశేషం. ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరు లోపు మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా అధికార యంత్రాంగం లక్ష్యంగా నిర్దేశించుకుంది. జిల్లాలోని ప్రతి రైతుభరోసా కేంద్రానికి 500 లేదా 1000 టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము ఉండాలనేది ప్రభుత్వ నిర్ణయం. ఇందుకు అనుగుణంగా బహుళ అవసరాల గోదాములు రూపుదిద్దుకుంటున్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మార్కెటింగ్ శాఖ కర్నూలు ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గోదాముల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. గత ఏడాది మార్చి నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోదాముల నిర్మాణాలను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఆ తర్వాత ఇటు కర్నూలు, అటు నంద్యాల జిల్లాల్లో మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలు ఊపందుకున్నాయి. పంటలను ఆరబెట్టుకునేందుకు ప్రతి గోదాముకు అనుబంధంగా ప్లాట్‌పామ్ కూడా నిర్మిస్తున్నారు.



చిన్నటేకూరులో పూర్తయిన గోదాము

1.51 లక్షల మెట్రిక్ టన్నుల గోదాములు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 227 మల్టీపర్పస్ గోదాములు నిర్మిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గోదాముల సామర్థ్యం 1.51 లక్షల మెట్రిక్ టన్నులు ఉండటం విశేషం. కర్నూలు జిల్లాలో రూ.46.05 కోట్ల వ్యయంతో 95 గోదాములు నిర్మిస్తున్నారు. ఇందులో 500 టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు 84, వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు 11 ఉన్నాయి. నంద్యాల జిల్లాలో రూ.75.2 కోట్లతో 132 గోదాములు నిర్మిస్తున్నారు. ఇందులో 64 గోదాములు 500 టన్నుల సామర్థ్యం, 68 గోదాములు 1000 టన్నుల సామర్థ్యం కలిగి ఉన్నాయి. 500 టన్నుల గోదామును రూ.40 లక్షలు, 1000 టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను రూ.75 లక్షలతో నిర్మిస్తున్నారు.

సెప్టెంబర్ చివరిలోపు పూర్తి చేసేందుకు కసరత్తు

మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలను ఈ ఏడాది సెప్టెంబర్ నెల చివరి లోపు పూర్తి చేసేందుకు మార్కెటింగ్ శాఖ కసరత్తు చేస్తోంది. కర్నూలు జిల్లాలో కొంత ఆలస్యంగా గోదాముల పనులు మొదలయ్యాయి. ఇప్పటి వరకు 8 గోదాముల పనులు పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 64 గోదాముల పనులు పూర్తయ్యాయి. ఆర్బీకే వారీగా నిర్మిస్తున్న గోదాముల నిర్వహణ బాధ్యతలను సంబంధిత ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)కు ప్రభుత్వం అప్పగిస్తోంది. మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం గోదాములను నిర్మించి పీఏసీఎస్‌లకు అప్పగిస్తుంది. గోదాముల నిర్మాణాలకు అవసరమైన నిధులను జిల్లా సహకార కేంద్రబ్యాంకు సంబంధిత పీఏసీఎస్‌కు లోన్ రూపంలో ఇస్తుంది. ఇప్పటికే రూ.40 కోట్ల నిధులు కూడా విడుదల చేసింది. రైతులు పండించిన పంటలను గోదాముల్లో నిల్వ చేయడం ద్వారా వచ్చే అద్దెల నుంచి పీఏసీఎస్‌లు రికవరీ చేస్తాయి. నష్టాల్లో ఉన్న పీఏసీఎస్‌లను లాభాల బాట పట్టించేందుకు వాటికి అనుబంధంగా గోదాములు నిర్మిస్తుండటం విశేషం.

గిట్టుబాటు ధర లేనప్పుడు నిల్వ



మా సొసైటీ పరిధిలో 11 గ్రామాలు ఉన్నాయి. మొక్కజొన్న, కందులు, వరి, వేరుశనగ, శనగ అధికంగా సాగు చేస్తున్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేనప్పుడు కొద్ది నెలల పాటు భద్రపరుచుకునేందుకు ఎలాంటి గోదాము సదుపాయం లేదు. ఈ కారణంగా తక్కువ ధరతో అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం సొసైటీ పరిధిలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన మల్టీపర్పస్ గోదాము నిర్మిస్తుండటం రైతులకు శుభపరిణామం. గోదాముల దగ్గర పంటలను ఆరబెట్టుకునేందుకు ప్లాట్‌పామ్ కూడా నిర్మిస్తున్నాం.

– కె.శేషారెడ్డి, చైర్మన్, పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, కర్నూలు మండలం

జిల్లా	నిర్మిస్తున్న గోదాములు	నిర్మాణాలకు నిధులు(కోట్లలో)
కర్నూలు	95	46.05
నంద్యాల	132	75.25
మొత్తం	227	121.30

పీఏసీఎస్‌లకు అప్పగిస్తాం



మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నిర్మాణాలు పూర్తయితే భవిష్యత్‌లో గోదాముల కొరత అనే ప్రశ్నే ఉండదు. గోదాములను నిర్మించి సంబంధిత పీఏసీఎస్‌లకు అప్పగిస్తాము. రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో ధర లేనప్పుడు గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చు. – సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కర్నూలు, మార్కెటింగ్ శాఖ

కలెక్టరేట్‌లో ఏపీడీపీసీ అథారిటీ కార్యాలయం

- డీఆర్వోతో కలిసి పరిశీలించిన జేసీ



కలెక్టరేట్‌లో వివిధ భవనాలను పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): రాయలసీమలోని 8 జిల్లాల పోలీసు అధికారులపై వచ్చే ఫిర్యాదులను విచారించడం కోసం ఏపీ డిస్ట్రిక్ట్ పోలీసు కంప్లెంట్ అథారిటీ కార్యాలయం కలెక్టరేట్‌లో ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య డీఆర్వో ఎస్వీనాగేశ్వరరావుతో కలసి వివిధ కార్యాలయాలను పరిశీలించారు. చివరకు డీఎస్‌ఓ కార్యాలయంలో ఏపీడీపీసీ అథారిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన విధంగా కార్యాలయాన్ని పది రోజుల్లో సిద్ధం చేయాలని డీఆర్వోను ఆదేశించారు. కాగా, ఏపీడీపీసీ అథారిటీ చైర్మన్‌గా వెంకటరమణారెడ్డి, సభ్యులుగా శశిదేవి, రాఘవరెడ్డిని ప్రభుత్వం నాలుగు నెలల క్రితమే నియమించింది. అయితే, కార్యాలయం లేకపోవడంతో వారు బాధ్యతలు చేపట్టలేకపోతున్నారు.

ఫెర్టిలిటీ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ఫెర్టిలిటీ కేంద్రాలు(అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టి) కేంద్రాలు, సరోగసి కేంద్రాలు) ఏఆర్‌టి, సరోగసి యాక్ట్–2021 ప్రకారం ఇకపై తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇందుకు ఏఆర్‌టీ నేషనల్ పోర్టల్(https://registry.artsurrogacy.gov.in)లో నిర్దేశించిన మొత్తం డీడీతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీటిని జిల్లా స్థాయి ఇన్‌స్పెక్షన్ టీమ్ పరిశీలించి అర్హత మేరకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీకి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీకి సిఫారసు చేస్తారన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

ఆగని ఆగ్రహ జ్వాల

- పవన్ వ్యాఖ్యలపై వెల్లువెత్తుతున్న నిరసన
- మండల కేంద్రాల్లో దిష్టిబొమ్మలు దహనం
- క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు
- బేషరతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్ల డిమాండ్



కౌతాళంలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై జిల్లా వ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఈ నెల 9వ తేదీన ఏలూరులో జరిగిన సభలో సంఘ విద్రోహ శక్తులుగా వలంటీర్లను అభివర్ణించిన పవన్ తిరిగి మరుసటి రోజు 10వ తేదీన కూడా వారిపై నోరు పారేసుకున్నారు. దీంతో మంగళవారం కూడా వలంటీర్లు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. పవన్ బేషరతుగా తమకు క్షమాపణ చెప్పాలని వివిధ ప్రాంతాల్లో ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు. తమను కించపరిచినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పలు పోలీస్‌స్టేషన్లలో వలంటీర్లు ఫిర్యాదులు చేశారు.

కల్లూరులో దిష్టిబొమ్మ దహనం

నగరపాలక సంస్థ పరిధిలోని కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో పెద్ద సంఖ్యలో హాజరైన వలంటీర్లు నిరసన కార్యక్రమం చేపట్టి పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి తగులబెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి హనుమంతురెడ్డి పాల్గొన్నారు. అలాగే ...మండల కేంద్రం తుగ్గలిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నగేష్, సచివాలయ ఉద్యోగుల సంఘం కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. పెద్దకడుబూరు, కౌతాళం, పత్తికొండ, ఆత్మకూరు, అవుకు మండలం రామాపురం తదితర ప్రాంతాల్లో కూడా పెద్ద సంఖ్యలో వలంటీర్లు పవన్ వ్యాఖ్యలపై మండిపడుతూ నిరసన వ్యక్తం చేశారు.

పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు

వలంటీర్ వ్యవస్థపై నీచంగా మాట్లాడిన పవన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో వలంటీర్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆస్పరిలో అసోసియేషన్ నాయకులు గఫూర్, నరసింహులు, ఎమ్మిగనూరులో సురేష్, ఆలూరులో వలంటీర్లు రవి, సోము, నవీన్, సృజన, సిద్ధు, విజయక్రిష్ణ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

కొనసాగనున్న నిరసనలు

పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అంచెలంచెలుగా వివిధ రూపాల్లో కార్యక్రమాలను నిర్వహించేందుకు వలంటీర్లు కార్యాచరణ రూపొందించుకున్నారు. ఈ నెల 12న నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు.

పవన్ దిగజారి మాట్లాడుతున్నారు



దేశ వ్యాప్తంగా నీరాజనాలు అందుకుంటున్న వలంటీర్ వ్యవస్థ గురించి పవన్‌కల్యాణ్ దిగజారి మాట్లాడుతున్నారు. పేద కుటుంబాల నుంచి వచ్చి నెలకు రూ.5 వేల వేతనంతో ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలను లెక్కచేయకుండా రోగులకు సేవలు అందించారు. అలాంటి వారిని అభినందించాల్సింది పోయి పవన్ కించపరిచి మాట్లాడటం దారుణం.

– హఫీజ్‌ఖాన్, కర్నూలు ఎమ్మెల్యే

పవన్ వ్యాఖ్యలు అర్థరహితం

- ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్



కర్నూలు(రాజ్‌విహార్): సేవా గుణంతో పనిచేసే వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వెంకటరమణ కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.5వేల పారితోషికంతో పనిచేసే వలంటీర్లు కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. ముఖ్యంగా ఫీవర్ సర్వే చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబితే అమెరికా లాంటి పెద్ద దేశాల్లోనే సమయానికి చేయలేకపోయారని, అయితే, రాష్ట్రంలో రెండు రోజుల్లోనే మన వలంటీర్లు పూరి చేశారన్నారు. జనసేన పార్టీ అధినేతకు అజెండా లేదని, మరొకరి కోసం ఆయన పనిచేస్తున్నారని విమర్శించారు. త్వరలో ఆయన పార్టీని అమ్ముకునే రోజులు వస్తాయన్నారు.

కష్టకాలంలో అన్నలా..

కరోనా కాలంలో పేదల జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఎంతో మంది పేదలు పూట గడిపేందుకు నానా కష్టాలు పడ్డారు. అలాంటి తరుణంలో కోసిగి మండలం జంపాపురం వలంటీర్ బసప్ప నాయుడు తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. తన ఐదు నెలల జీతాన్ని పేదలకు సాయంగా అందజేశాడు.డిగ్రీ చదువుకున్న ఈ యువకుడు సామాజిక సేవలోనే ఎక్కువ సంతృప్తి ఉందని 2019లో వలంటీర్‌గా చేరాడు. నాలుగేళ్ల నుంచి ప్రభుత్వ పథకాలు, సేవల గురించి ఇంటింటికి వెళ్లి తెలియజేసి అర్హులకు వాటిని అందజేస్తున్నారు. అనాథలు, నిరుపేదలకు కష్ట కాలంలో తన వంతుగా నిత్యావసరాలు అందజేస్తూ సేవానిరతిని చాటుకుంటున్నాడు. సదరు వలంటీర్ పనితీరుపై గ్రామస్తులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– మంత్రాలయం



పెళ్లికి రూ. 5 వేలు అందిస్తున్న బసప్పనాయుడు

పెళ్లికి సాయం చేశాడు



మాది చాలా పేద కుటుంబం. మా అమ్మానాన్నలు ఉసేన్‌బాషా, గౌసియా పనికి వెళితేనే ఇల్లు గడుస్తుంది. మాకు ఎలాంటి ఆస్తి పాస్తులు లేవు. మా ఊరిలో చందాలు ఎత్తి నా పెళ్లి చేశారు. ఆ సమయంలో మా గ్రామ వలంటీర్ బసప్పనాయుడు నెల జీతం రూ.5 వేలు సాయం చేశాడు. వలంటీర్ అన్న చేసిన సాయం నేను ఎప్పటికీ మరువను.

– రేష్మ, జంపాపురం

కల్లూరు ఇన్‌చార్జ్ ఎస్‌ఆర్‌గా ప్రభావతి

కర్నూలు(సెంట్రల్): కల్లూరు ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న చైతన్య రాయలును కడప జిల్లా దువ్వూరుకు డిప్యుటేషన్‌పై పంపడంతో ఆ స్థానంలో ఇన్‌చార్జ్ ఎస్‌ఆర్‌గా ప్రభావతికి జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు బాధ్యతలు అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆమె కొత్తగా సబ్ రిజిస్ట్రార్ వచ్చే వరకు ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తారు.

తనిఖీలు ముమ్మరం చేయండి

- నకిలీ విత్తనాలు, అనధికార విత్తనాలకు తావు ఉండరాదు
- స్క్వాడ్ ఏడీఏ, ఏఓలకు జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశం



మాట్లాడుతున్న డీఏఓ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో నకిలీ, అనధికార విత్తనాలకు ఎంతమాత్రం అవకాశం లేకుండా ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి స్క్వాడ్ బృందాలను ఆదేశించారు. మంగళవారం తన చాంబరులో స్క్వాడ్ బృందాల ఏడీఏలు, ఏఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నకిలీ విత్తనాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ... రాష్ట్రంలో బీటీ పత్తి విత్తనాలకు సంబంధించి ఎటువంటి కో–మార్కెటింగ్ లేదని, ఎక్కడైనా కో–మార్కెట్ పేరుతో పత్తి విత్తన ప్యాకెట్లు అమ్ముతుంటే వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. జిల్లా మొత్తంగా ఉన్న విత్తన దుకాణాలు, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, విత్తన కంపెనీలు, ట్రాన్స్‌పోర్టు కంపెనీలు, కొరియర్ సర్వీస్‌లు ఇలా అనుమానం ఉన్న ప్రతి చోట తనిఖీలు నిర్వహించాలన్నారు. కాలంచెల్లిన విత్తనాల అమ్మకాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో స్క్వాడ్ ఏడీఏలు వేదమణి, సంధ్యారాణి, వెంకటేశ్వర్లు, ఏఓలు రామకృష్ణ, శశిధర్‌రెడ్డి, హేమలత, సాంకేతిక ఏఓ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెప్పాడంటే..చేస్తాడంతే!

- 2018లో సాక్షరభారత్ కో ఆర్డినేటర్లను తొలగించిన నాటి ప్రభుత్వం
- న్యాయం చేస్తానని పాదయాత్రలో వైఎస్ జగన్ హామీ
- మాట ప్రకారం స్వచ్ఛ భారత్ మిషన్ –2 (గ్రామీణ్)లో ఉద్యోగాలు
- 47 మందికి నియామక పత్రాలను అందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ

ప్రజా సంకల్ప పాదయాత్రలో వారి కష్టాలను విన్నాడు ... మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తప్పక న్యాయం చేస్తానన్నాడు ... ఇచ్చిన మాట ప్రకారం వారందరికీ నేడు ఉద్యోగాలు కల్పించారు. నాలుగేళ్ల నిరీక్షణ అనంతరం ఊహించని విధంగా తమ కలను నెరవేర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సదా రుణపడి ఉంటామని స్వచ్ఛభారత్ మిషన్–2 (గ్రామీణ్)లో ఉద్యోగాలు పొందిన వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు(అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించిన సాక్షర భారత్ ప్రాజెక్టులో ప్రతి మండలానికి ఒకరు ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 53 మండలాల్లో 53 మంది నిరుద్యోగులు మండల కో ఆర్డినేటర్లుగా గతంలో పనిచేశారు. అయితే ప్రాజెక్టు కాల వ్యవధి పూర్తి కావడంతో 2018 మార్చి 31వ తేదీన వారికి ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా అదే ఏడాది జూన్‌లో ఉద్యోగాల నుంచి తొలగించారు. కేవలం నెలకు రూ.6 వేల జీతంతో జీవితాలను గడిపే వీరంతా అప్పటి చంద్రబాబు పాలనలో రోడ్డున పడ్డారు. అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర జిల్లాకు చేరుకున్న సమయంలో సాక్షరభారత్‌లో ఉద్యోగాలు కోల్పోయిన వారంతా కలిశారు. తమకు జరిగిన అన్యాయాన్ని, కష్టాలను వైఎస్ జగన్‌కు వినిపించారు. ఓపిగ్గా విన్న ఆయన అధికారంలోకి వచ్చాక మీ కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సాక్షరభారత్‌లో అప్పట్లో ఉద్యోగాలు కోల్పోయిన వారందరికీ స్వచ్ఛ భారత్ మిషన్ –2 (గ్రామీణ్) లో మండల్ రిసోర్స్ కో– ఆర్డినేటర్లుగా అవకాశం కల్పించారు. సాక్షరభారత్‌లో పనిచేస్తున్న సమయంలో వీరికి నెలకు రూ.6 వేలు మాత్రమే జీతంగా ప్రభుత్వం చెల్లించేది. ప్రస్తుతం వీరికి నెలకు రూ.13 వేలు జీతం ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

47 మందికి నియామకపత్రాలు

సాక్షరభారత్‌లో మండల కోఆర్డినేటర్లుగా పనిచేసి ఉద్యోగాలు కోల్పోయిన వారిలో 47 మందికి స్వచ్ఛ భారత్ మిషన్ –2 (గ్రామీణ్)లో ఎంఆర్‌సీలుగా నియామక పత్రాలను అందించారు. మంగళవారం స్థానిక జెడ్పీలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఈ బి. నాగేశ్వరరావు వీరికి నియామక పత్రాలు అందించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలను అమలు చేయాలని ఎస్‌ఈ సూచించారు.



నియామక పత్రాలను అందుకున్న వారితో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు

బాబు పాలనలో ఉద్యోగం పోయింది



దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో సాక్షరభారత్‌లో మండల కో–ఆర్డినేటర్‌గా ఉద్యోగం పొందా. 2018లో చంద్రబాబు పాలనలో ఆ ఉద్యోగం పోయింది. 2023లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తిరిగి ఉద్యోగాలు పొందాం. నాడు పాదయాత్రలో ఇచ్చిన మాటను వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారు. అప్పట్లో నెలకు రూ.6 వేలుగా ఉన్న జీతాన్ని ప్రస్తుతం రూ.13 వేలకు పెంచారు. మా ఉద్యోగాలను ఆప్కాస్‌లో చేర్చి జీవితానికి భద్రత కల్పించారు.

– రాజ్‌కుమార్, చాగలమర్రి

దొర్నిపాడులో జగనన్నను కలిశాం



ఉమ్మడి కర్నూలు జిల్లాలోని దొర్నిపాడు సమీపంలో పాదయాత్రలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి మా కష్టాలను విన్నవించాం. అధికారంలోకి వచ్చాక తప్పనిసరిగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మేము ఊహించిన దానికంటే మంచి ఉద్యోగాలు కల్పించారు. మీకు ఇంకా మంచి భవిష్యత్తును కల్పిస్తామని భరోసా ఇచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో తమకు అప్పగించిన పాత్రకు సంపూర్ణ న్యాయం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తాం.

– వై సురేష్, మహానంది

క్లుప్తంగా

పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై విజి'లెన్స్'

- ఉమ్మడి జిల్లాలో విస్తృత తనిఖీలు
- 254.95 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యం సీజ్



బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

కర్నూలు: ప్రజాపంపిణీ ద్వారా పేద ప్రజలకు సబ్సిడీపై అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కొంత మంది దళారులు సేకరించి పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి నీలం పూజిత ఆదేశాల మేరకు అధికారులు బృందాలుగా ఏర్పడి ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో సుబ్రహ్మణ్యం శెట్టి 110.10 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి బియ్యాన్ని సీజ్ చేసి ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈసీ యాక్ట్ 1955 ప్రకారం 6ఏ కేసు నమోదు చేసి రవాణాకు ఉపయోగించిన ఐచర్ వాహనాన్ని కూడా సీజ్ చేశారు. అలాగే నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో ఎరుకలి చక్రపాణి రెండు వాహనాల్లో 144.85 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను రవాణా చేస్తుండగా నిఘా వేసి పట్టుకుని బియ్యంతో పాటు వాహనాలను సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఆళ్లగడ్డ పోలీసులకు అప్పగించారు. తనిఖీల్లో సీఐ నాగరాజు యాదవ్, తహసీల్దార్ వెంకటనారాయణ, ఏఓ రూఫస్, ఎస్‌ఐలు హనుమంతు, జయన్న తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యంపై శిక్షణ

కర్నూలు సిటీ: మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, ఎస్‌సీఈఆర్‌టీ వారు 'జీవన నైపుణ్యం'అనే అంశంపై మూడు రోజుల పాటు పీఈటీ/పీడీ, టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.వసుంధర మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన 100 మందికి ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు, 17 నుంచి 19వ తేదీ వరకు ప్రభుత్వ డైట్ కాలేజీ(బి.తాండ్రపాడు)లో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

ఫెయిలైన వారికి అవకాశం

కర్నూలు సిటీ: 2018కి ముందు డీఎల్‌ఈడీ రెండేళ్ల కోర్సుగా ఉండేది. ఆ కోర్సు చదివి ఫెయిల్ అయిన వారికి పరీక్షలు రాసుకునేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం అవకాశం కల్పించింది. ఈ విషయాన్ని ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ వసుంధర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనల్ లెవన్ ప్రాక్టికల్ పరీక్షలను ఈ నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయిన వారి వివరాలను తీసుకుని ఈ నెల 12వ తేదీన బి.తాండ్రపాడు డైట్ కాలేజీకి వచ్చి ప్రాక్టికల్ పరీక్షకు ఏర్పాట్లు చేయించుకోవాలని అయా ప్రైవేటు డీఎల్‌ఈడీ కాలేజీల ప్రిన్సిపాల్స్/కరస్పాండెంట్లకు ఆమె సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: ఐటీఐ కాలేజీల్లో ప్రవేశాలకు రెండో విడతగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ(బాలికల)కాలేజీ ప్రిన్సిపాల్ పి.వి. ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. కౌన్సెలింగ్ ఆగస్టులో జరుగుతుందన్నారు.

తియ్యని 'ఉపాధి'

జిల్లా సగటు వేతనం రూ.268

- 2023-24లో 92 లక్షల పని దినాలు లక్ష్యం
- జూలై 8 నాటికి 64,30,829 పని దినాలు పూర్తి
- పండ్ల తోటల అభివృద్ధికి ప్రాధాన్యం
- ముమ్మరంగా గుంతల తవ్వకం
- వ్యవసాయ పనుల్లేని సమయంలో అండగా ఉపాధి పథకం



పండ్ల మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలను పరిశీలిస్తున్న పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలు, సామాన్య రైతు కుటుంబాలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆదుకుంటోంది. వర్షాలు లేనందున జూన్ నెలలో కూడా ఉపాధి పనులకు డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం ప్లాంటేషన్‌కు సంబంధించి గుంతల(పిట్టింగ్) పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వలసల నియంత్రణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టగా.. ఆ మేరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు కల్పిస్తోంది. ఫలితంగా ఉపాధి కూలీలకు వేజ్ ద్వారా రూ.174 కోట్లు లభించాయి. ఉపాధి పనుల్లో భాగంగా చెరువులు, నీటిపారుదల కాల్వల నుంచి పంట పొలాలకు వెళ్లే కాల్వల్లోని పూడికను తొలగించడం వంటి పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. తాజాగా పండ్లతోటల అభివృద్ధిలో భాగంగా పండ్లమొక్కలు నాటుకునేందుకు గుంతల తవ్వకం పనులు చేపడుతున్నారు.

మూడు నెలల్లో 64.30 లక్షల పని దినాలు

2023-24 సంవత్సరంలో జిల్లాలో 92 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం. అయితే మొదటి మూడు నెలల్లోనే రికార్డు స్థాయిలో పనులు కల్పించడం విశేషం. ఏప్రిల్ 1 నుంచి జూన్ నెల 8వ తేదీ వరకు 64,30,829 పనిదినాలు కల్పించ్పించారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనుల ద్వారా సొంత గ్రామాల్లోనే ఉపాధి పొందే అవకాశం ఏర్పడింది. అమృత్ సరోవర్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన చెరువుల్లో పూడిక తీత పనులను ఉపాధి నిధులతో కూలీల ద్వారా చేపట్టనున్నారు. ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌లోకి మారడటం వల్ల 2022-23 నుంచి అలవెన్స్‌లకు కోతపడినా ఆ నష్టాన్ని భర్తీ చేసే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా సగటు వేతనం రూ.268 ఉండగా.. ప్రతి ఒక్కరికీ గరిష్ట వేతనం రూ.272 లభించేలా ఉదయం సాయంత్రం వేళల్లో పనులు చేసే వెసులుబాటు కల్పించారు. కల్లూరు, పత్తికొండ, కోడుమూరు, ఆదోని, కౌతాళం, పెద్దకడుబూరు, కోసిగి తదితర మండలాల్లో ఉపాధి కూలీలకు గరిష్ట వేతనం లభిస్తోంది.

పిట్టింగ్ పనులకు ప్రాధాన్యత

ఈ ఏడాది జిల్లాలో పండ్లతోటల అభివృద్ధికి జిల్లా నీటియాజమాన్య సంస్థ చర్యలు చేపట్టింది. 2023-24లో జిల్లాలో 6,450 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ఐదు ఎకరాల్లోపు భూమి ఉండి.. జాబ్ కార్డు కలిగిన రైతులందరు అర్హులే. పండ్లతోటల అభివృద్ధికి ప్రస్తుతం అర్హులైన రైతుల ఎంపిక, మంజూరు, పిట్టింగ్ పనులు తదితరాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే 5,500 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి కలెక్టర్ అనుమతులు కూడా మంజూరు చేశారు. ఆ మేరకు దాదాపు 2వేల ఎకరాల్లో పిట్టింగ్ పనులు పూర్తి చేయడం విశేషం.

మూడు నెలల్లోనే 64 లక్షల పని దినాలు

2023-24లో 92 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం. మొదటి త్రైమాసికంలోనే 64.30 లక్షల పనిదినాలు కల్పించాం. వ్యవసాయ పనులు లేని సమయంలో అడిగిన వారందరికీ పనులు కల్పించాం. ప్రస్తుతం పండ్లతోటల అభివృద్ధిలో భాగంగా గుంతల(పిట్టింగ్) పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కర్నూలు

4వేల వెజిటబుల్ సోలార్ డ్రయ్యర్ల ఏర్పాటు లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న మూడు నెలల్లో 4వేల సోలార్ డ్రయ్యర్ల ఏర్పాటు లక్ష్యంగా పనిచేయాలని, ఇందుకోసం ఆసక్తి కలిగిన మహిళలను గుర్తించాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, ఏపీఎంలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ-వైకేపీ కార్యాలయంలో ఏరియా కోఆర్డినేటర్లు, డీపీఎం, ఏపీఎంలతో నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. ప్రధానంగా ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఉన్న 19 మండలాల్లో సోలార్ డ్రయ్యర్ల ద్వారా పొదుపు మహిళలకు ఉపాధి కల్పించాలన్నారు. మహిళలకు సంబంధించిన అన్ని అంశాల్లో కర్నూలు జిల్లాను రాష్ట్రంలోనే ఉన్నతస్థానంలో నిలపాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. పొదుపు మహిళల జీవనోపాధుల అభివృద్ధిలో భాగంగా పెరటి కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ అదనపు పీడీ షరీఫ్, డీపీఎంలు నరసమ్మ, అయ్యమ్మ, అనిల్‌కుమార్, రెహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి బలవన్మరణం

- కుమారుడి మరణంతో మూడేళ్లుగా మనస్తాపం



సౌభాగ్యలక్ష్మి (ఫైల్)

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు బలవన్మరణానికి పాల్పడింది. ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. స్థానిక రోజా డీఎడ్ కళాశాల సమీపంలో నివాసం ఉంటున్న సౌభాగ్యలక్ష్మి(52) సంజామల మండలం ఆకుమల్ల ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమె కుమారుడు విక్రమసింహారెడ్డి హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ మూడు సంవత్సరాల క్రితం కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్యకు పాల్పడటంతో అప్పటి నుంచి సౌభాగ్యలక్ష్మి తీవ్ర మానసిక వేదనతో బాధపడుతోంది. సోమవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఆమె బెడ్‌రూంలో నిద్రకు ఉపక్రమించింది. భర్త సుధాకర్‌రెడ్డి సోఫాలోనే నిద్రపోయాడు. మానసిక క్షోభను ఎదుర్కొంటున్న సౌభాగ్యలక్ష్మి అర్ధరాత్రి బెడ్‌రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం భర్త లేచి చూసే సరికి ఉరికి వేలాడుతుండటంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి, ఎస్‌ఐ వెంకటరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మూడేళ్ల వ్యవధిలో కుమారుడు, భార్యను కోల్పోయి సుధాకర్‌రెడ్డి, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రైలు ఢీకొని విద్యుత్ లైన్‌మన్ మృతి



రంగనాథ్ ప్రసాద్ (ఫైల్)

కర్నూలు: కర్నూలు విద్యుత్ పవర్ హౌస్‌లోని సెంట్రల్ సెక్షన్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న మంగళి రంగనాథ్ ప్రసాద్ (50) రైలు ఢీకొని మృతిచెందాడు. మంగళవారం ఉదయం కోట్ల రైల్వేస్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి రైలు వచ్చే సమయంలో ట్రాక్ దాటుతూ ప్రమాదానికి గురై కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో ముక్కు, నోరు, చెవిలో తీవ్ర రక్త స్రావమైంది. రైల్వే స్టేషన్ మాస్టర్ నాగేంద్రకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఆయన ఫిర్యాదు మేరకు రైల్వే పీఎస్ సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఆర్‌టీఎఫ్ ఏఎస్‌ఐ రమేష్‌రెడ్డి తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. రైలు వస్తుందన్న కంగారులో ట్రాక్ దాటుతూ ప్రమాదానికి గురై ఉండొచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా రైల్వే కొండాపురం ఈయన స్వగ్రామం. ఏడాది క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో ఆత్మకూరు సెక్షన్ నుంచి కర్నూలు విద్యుత్ పవర్ హౌస్ సెంట్రల్ సెక్షన్‌కు బదిలీపై వచ్చాడు. బుధవారపేటలో గది అద్దెకు తీసుకుని ఒక్కడే ఉంటున్నాడు. భార్య ఆదిలక్ష్మమ్మ, ఇద్దరు కూతుర్లు, కుమారుడు సంతానం. వారంతా స్వగ్రామం రైల్వే కొండాపురంలోనే ఉంటున్నారు. ప్రసాద్ ప్రమాదంలో మృతిచెందిన సంఘటనను పోలీసులు కుటుంబ సభ్యులకు చేరవేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. సంఘటనపై విచారణ కొనసాగుతున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- రూ.4.65 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



తుగ్గలిలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జున

తుగ్గలి: దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని తుగ్గలి పోలీసులు పట్టుకుని బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. రాంపల్లికి చెందిన బోయ అగ్రహారం రంగస్వామి, వడ్డే నల్లన్న సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలు చేయాలనుకున్నారు. ఈ క్రమంలో తుగ్గలి, పత్తికొండ, దేవనకొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు ఇళ్లకు కన్నం వేసి బంగారు, వెండి నగలు దొంగలించారు. వరుస చోరీలు జరగడంతో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి నిఘా ఉంచారు. దొంగల కదలికలపై దృష్టిపెట్టి తుగ్గలి నుంచి ఎద్దులదొడ్డికి వెళ్లే రస్తాలో చెరువుకట్టవద్ద చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 78 గ్రాముల బంగారం, 123 గ్రాముల వెండి నగలను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన దొంగలపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. దొంగలను పట్టుకున్న ఎస్‌ఐ మల్లికార్జున, ఏఎస్‌ఐ నరసప్ప, పోలీసులను సీఐ అభినందించారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్

- ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలి
- 100 శాతం బిల్లులు రాబట్టాలి
- ఎస్పీడీసీఎల్ సీఎండీ కె. సంతోషరావు



ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీఎండీ కె. సంతోషరావు

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఎస్పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఆదేశించారు. మంగళవారం కర్నూలుకు వచ్చిన ఆయన నగర శివారులోని ట్రాన్స్‌కో 220 కేవీ సబ్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ముందుగా టిడ్కో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించి, టెక్నికల్‌గా చార్జ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో ఏర్పడే విద్యుత్ అంతరాయ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంపై ఆపరేషన్స్ సిబ్బంది దృష్టి సారించాలన్నారు. వినియోగదారులకు అందుబాటులో ఉంటేనే సమస్యలు తెలుస్తాయని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉచిత విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం వహించరాదని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు. విద్యుత్ సిబ్బంది, అధికారులు పనిచేసే చోట నివాసం ఉండాలని పదే పదే చెబుతున్నామని, అయినా కొందరిలో మార్పు రావడం లేదన్నారు. నెల వారి బిల్లులు 100శాతం వసూలు చేయాలని, జిల్లాలో ఉన్న పాత బకాయిలపై దృష్టి పెట్టి రాబట్టాలన్నారు. విద్యుత్ చౌర్యం పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. వృథా విద్యుత్ (లైన్‌లాస్)పై దృష్టి పెట్టి నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, పొదుపు సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, కాలిపోయిన వాటిని మార్చడంలో నిబంధనలు పాటించాలని చెప్పారు. మంజూరైన పనులను సకాలంలో పూర్తి చేసి వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌ఈలు ఉమాపతి (ఆపరేషన్స్), కృష్ణకుమార్ (ట్రాన్స్‌కో) ఇతర విభాగాల ఈఈలు, ఏడీఈలు పాల్గొన్నారు.

రైతులకు గడువులోగా కనెక్షన్ ఇవ్వండి

పాణ్యం: వ్యవసాయ కనెక్షన్లపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా రైతులు దరఖాస్తు చేసుకున్న నెలలోపు కనెక్షన్లు ఇవ్వాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు విద్యుత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో నంద్యాల డివిజన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల, నంద్యాల రూరల్, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల సబ్ డివిజన్లకు సంబంధించిన మండలాల్లో విద్యుత్ సమస్యలు, పరిష్కారం, తదితర విషయాలపై సమీక్షించారు. విద్యుత్ కోతలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ కనెక్షన్లకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటికి నెల రోజుల లోపు ఎందుకు కనెక్షన్లు ఇవ్వలేదు అనే విషయాలపై ఆరా తీసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో సీజీఎంలు గురువయ్య, ధర్మజ్ఞాని, ఎస్‌ఈ ఉమాపతి, ఈఈ రమణారెడ్డి పాల్గొన్నారు.

మద్యానికి బానిసై..

జూపాడుబంగ్లా: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం తెల్లవారుజామున 80 బన్నూరు గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన ఆంజనేయులు, మద్దమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కుమారుడు వేణు(31)కి ఐదేళ్ల క్రితం నన్నూరు గ్రామానికి చెందిన శ్రీదేవితో వివాహం చేశారు. వివాహమైన ఆరుమాసాలకే ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా వేణు మరో వివాహం చేసుకోకుండా అలాగే ఉన్నాడు. మనస్తాపానికి గురైన వేణు మద్యానికి అలవాటుపడ్డాడు. పాలిష్ బండల కటింగ్ చేస్తూ హైదరాబాదులో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. పది రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి సోమవారం రాత్రి అందరూ నిద్రపోయిన తర్వాత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆర్‌యూలో ముగ్గురు ప్రొఫెసర్లపై వేటు?

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఆచార్యులపై వేటు పడే అవకాశం ఉంది. టీడీపీ ప్రభుత్వం 2015-16లో రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి జీఓ నంబర్ 30 ద్వారా నోటిఫికేషన్ జారీ చేసి 2017లో భర్తీ చేసింది. అయితే, కొందరు ఈ నియామకాలను తప్పుపడుతూ యూజీసీ నిబంధనలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మహిళ రిజర్వేషన్ పాటించలేదని ప్రభుత్వానికి విన్నవించడంతో పాటు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం ఆ నియామకాలను రద్దు చేయాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ జరిపిన న్యాయస్థానం ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆర్‌యూలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ప్రొఫెసర్లు సుందరానంద పుచ్చ, విశ్వనాథరెడ్డి, భరత్‌కుమార్ నియామకాలు రద్దయ్యే అవకాశం ఉంది. దీనిపై ఆర్‌యూ వీసీ ఆచార్య ఎ.ఆనందరావును వివరణ కోరగా కోర్టు ఆదేశాల మేరకు వారిని తొలగిస్తామని వెల్లడించారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా

- పలువురికి గాయాలు



గాయపడిన విద్యార్థులు వెన్నెల, మోహన్

ఆస్పరి: మండలంలోని కలపరి గ్రామ సమీపంలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కైరుప్పలలో వాగ్దేవి ఇంగ్లిషు మీడియం ప్రైవేట్ స్కూల్ నిర్వహిస్తున్నారు. ఈ స్కూల్ బస్సు మంగళవారం ఉదయం బైలుపత్తికొండ, దొడగొండ, కలపరి గ్రామాలకు చెందిన విద్యార్థులను తీసుకొస్తుంది. కలపరి గ్రామం సమీపంలోని క్రాస్ దగ్గర బస్సు అదుపు తప్పడంతో పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. గమనించిన స్థానిక కూలీలు, రైతులు వెంటనే బస్సులో నుంచి విద్యార్థులను బయటకు తీశారు. కాగా ఈఘటనలో 6వ తరగతి చదువుతున్న కార్తీక్‌కు తీవ్ర గాయాలు కాగా వెన్నెల, మోహన్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. దొడగొండకు చెందిన కార్తీక్‌ను చికిత్స నిమిత్తం ఆదోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న సీఆర్‌పీ పరమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.



కలపరి గ్రామ సమీపంలో బోల్తా పడిన ప్రైవేట్ స్కూల్ బస్సు

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

- లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి



కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు అందితే విచారణ జరిపి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ, అసైన్డ్ భూములపై మంగళవారం ఆయన తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. శ్రీసత్యసాయి జిల్లా కొత్త చెరువు మండలంలోని కొత్త చెరువు, తలమారియా, కొత్తపల్లి గ్రామాల పరిధిలోని రూ.3 కోట్లు విలువ చేసే ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, అక్రమార్కులకు రెవెన్యూ అధికారులు సహకరించి వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేస్తున్నారని కొత్త చెరువుకు చెందిన ఎన్.రవిచంద్రతో పాటు కొందరు గ్రామస్తులు 2021లో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి విచారణ కోసం అనంతపురం జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈక్రమంలో విచారణకు దిగిన ఆర్‌డీఓ అప్పటి కొత్తచెరువు తహసీల్దార్ కె.రామచంద్రప్ప అక్రమార్కులతో చేతులు కలిపి ప్రభుత్వ, అసైన్డ్ భూములను వారి పేరిట మార్చేందుకు వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేసినట్లు గుర్తించారు. దీంతో ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయించారు. అంతేకాక కొత్త చెరువు వీఆర్వో టి.రవిశంకర్, తలమారియా వీఆర్వో టి.చెన్నయ్య, కొత్తపల్లి వీఆర్వో హిజ్బుర్ రహిమాన్ ఆక్రమణల్లో పాలుపంచుకున్నట్లు గుర్తించి వారిపై శాఖపరమైన చర్యలకు జిల్లా యంత్రాంగం ఉపక్రమించింది. చివరకు అక్రమార్కుల పేరిట నమోదైన పట్టాదారు పాసుపుస్తకాలను రద్దు చేసి ఆ భూములను కూడా వెనక్కి తీసుకుని పరిరక్షించినట్లు మంగళవారం లోకాయుక్తకు సమర్పించిన నివేదికలో పేర్కొనడంతో కేసు మూసి వేస్తున్నట్లు చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్ రెడ్డి తీర్పు చెప్పారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులే అక్రమార్కులకు వంతపాడటం దారుణమని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.

సబ్సిడీ టమాటకు పోటెత్తారు

- ప్రత్యేక కౌంటర్ల ద్వారా రూ.50 ప్రకారం పంపిణీ
- మూడు రైతుబజార్లలో 6 టన్నుల అమ్మకాలు



సీ.క్యాంపు రైతుబజారులో పంపిణీ దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న టమాట కోసం వినియోగదారులు పోటెత్తుతున్నారు. వెంకటరమణ కాలనీలోని అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజారులో వినియోగదారులు దాదాపు 50 మీటర్ల పొడవున వరుసలో నిలబడ్డారు. మార్కెటింగ్ శాఖ మంగళవారం కర్నూలు నగరంలోని మూడు రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కిలో రూ.50 ప్రకారం టమాట పంపిణీ చేసింది. బయట మార్కెట్‌లో రూ.120 నుంచి రూ.140 వరకు అమ్మకాలు జరుగుతుండటంతో సబ్సిడీ టమాటకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం వినియోగదారుల కోసం మదనపల్లి నుంచి తెప్పించి రైతు బజార్లలో రూ.50కే కిలో పంపిణీ చేస్తుంది. మంగళవారం 6 టన్నుల టమాట పంపిణీ చేశారు. ప్రభుత్వం కిలోకు రూ.63.09 సబ్సిడీ భరిస్తుండటం విశేషం. ఎక్కువ మంది వినియోగదారులకు ప్రయోజనం కలిగించాలనే లక్ష్యంతో ఒక్కొక్కరికి కిలో ప్రకారం పంపిణీ చేశారు. సి.క్యాంపు రైతుబజారులో టమాట పంపిణీని మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి పర్యవేక్షించారు. అమీన్‌అబ్బాస్‌నగర్, కొత్తపేట రైతుబజార్లకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. సి.క్యాంపు రైతుబజారులో ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్, అమీన్ అబ్బాస్ నగర్ రైతు బజార్ ఎస్టేటు అధికారి కళ్యాణి ఆధ్వర్యంలో వినియోగదారులకు టమాట పంపిణీ చేశారు.



టమాటల కోసం అమీన్ అబ్బాసనగర్‌లో వరుసలో నిలుబడిన వినియోగదారులు